సాక్షి ఆదిలాబాద్

మంగళవారం। 19 । మార్చి । 2024



అకాల వర్షం.. అపార నష్టం

తలమడుగు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కురిసిన వడగళ్ల వర్షానికి మొక్కజొన్న, వేరుశనగ, పొగాకు పంటలు నేలకొరిగాయి. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ : 6:28	బుధ : 4:58

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/20.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

తునికాకు బోనస్ చెల్లించాలని ఆందోళన



ధర్నా చేస్తున్న ఆదివాసీలు

కైలాస్‌నగర్: పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ వెంటనే చెల్లించాలని, అలాగే ఆకు సేకరణను ప్రభుత్వమే చేపట్టాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జిల్లాలోని గిరిజన, గిరిజనేతరులకు వ్యవసాయం తర్వాత తునికాకు సేకరణ ప్రధాన ఉపాధిగా ఉందన్నారు. కల్లాలను ఏటా తగ్గిస్తుండటంతో కూలీలు ఉపాధి కోల్పోతున్నారన్నారు. బోనస్‌ను పలు జిల్లాల్లో కూలీలకు ఇప్పటికే చెల్లించగా జిల్లాలో మాత్రం పెండింగ్‌లో పెట్టారన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు సచిన్, రాఘవులు, స్వామి, ఆశమ్మ, విష్ణు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఆనంద్‌రావు

ఎదులాపురం: పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా సమష్టిగా పని చేద్దామని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల కో–ఆర్డినేటర్ సెడ్మకి ఆనంద్‌రావ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమన్వయంతో పని చేస్తే ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గెలుపు ఖాయమన్నారు. ఇందులో పార్టీ ఆదివాసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శేష్‌రావు, మహిళా విభాగం నాయకురాలు అనుసూయ, నాయకులు శంకర్, రాజేందర్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

చల్లబడ్డ వాతావరణం

- జిల్లాలో పలుచోట్ల అకాల వర్షం

కైలాస్‌నగర్: జిల్లాలో పక్షం రోజులుగా దంచికొట్టిన ఎండలతో వేడెక్కిన వాతావరణం రెండు రోజులుగా చల్లబడింది. జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై అరగంట పాటు చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. పలు మండల్లాలో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు వీచాయి. అకాలవర్షంతో యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న, జొన్న, నువ్వులు వంటి పంటలు దెబ్బతిన్నాయి. కాగా, ఎండ వేడితో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఈ వర్షంతో కొంత ఉపశమనం పొందారు.

అక్రమ లేఅవుట్‌లో హద్దురాళ్ల తొలగింపు



హద్దు రాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని జీఎస్ ఎస్టేట్ సమీపంలోని అక్రమ లే అవుట్‌లో వేసిన బండ రాళ్లను బల్దియా అధికారులు సోమవారం తొలగించారు. మున్సిపల్ కమిషనర్ ఖమర్ హైమద్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక విభాగం అధికారి అనురాధ ఆధ్వర్యంలో లే అవుట్‌ను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా పాతిన బండరాళ్లను జేసీబీతో తొలగించేశారు.



ఇతడి పేరు రాజేందర్ గౌడ్. మంచిర్యాల జిల్లా మందమర్రి. గత ఫిబ్రవరి 26న ఆదిలాబాద్ కలెక్టరేట్ ప్రజావాణిలో అప్పటి కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి దరఖాస్తు అందజేశాడు. ఆదిలాబాద్ జిల్లాలో అవుట్‌సోర్సింగ్ వివరాలు ఇవ్వాలని జిల్లా ఉపాధికల్పన అధికారిని పలుమార్లు కోరినప్పటికీ ఇవ్వడం లేదని అందులో పేర్కొన్నాడు. ఆర్టీఐ ద్వారా అడిగినా దాటవేస్తున్నారని ఆరోపించాడు. అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల పేరిట అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాడు. అందుకు సహకరిస్తున్న జిల్లా ఉపాధికల్పన అధికారిపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈఎస్ఐ, ఈపీఎఫ్, జీఎస్టీ చెల్లించని ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని వివరించాడు.



ఈయన పేరు బత్తుల రామన్న. ఆదిలాబాద్‌రూరల్ మండలం భీంసరి గ్రామం. మావల మండలం సర్వే నం.170లో ఇతడు వేరే వారి నుంచి కొనుగోలు చేసిన స్థలంలో కట్టిన ఇంటి నిర్మాణానికి మున్సిపాలిటీ అనుమతి తీసుకోలేదని గతేదాది ఆగస్టు 11న పొక్లెయిన్‌తో కూల్చినట్లు ఆరోపిస్తున్నాడు. తన ఇంటికి డోర్ నంబర్, కరెంట్ మీటర్, రిజిస్ట్రేషన్ ఉన్నప్పటికీ మున్సిపాలిటీలోని కొంత మంది దౌర్జన్యంగా ఇలా వ్యవహరించారని వాపోయాడు. కాగా అదే సర్వే నంబర్‌లో ఇలా పర్మిషన్ తీసుకోకుండా కట్టిన ఇండ్లు ఎన్ని ఉన్నాయని మున్సిపాలిటీలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నాడు. అయితే వారిచ్చిన సమాధానం చూసి ఆయన అవాక్కవ్వాల్సిన పరిస్థితి. అలాంటి ఇండ్లకు సంబంధించి ఇంటి నంబర్, ఓనర్ పేరు, కాలనీ పేరు, ప్లాట్ నంబర్, సర్వే నంబర్, వార్డు నంబర్ సమాచారం ఇవ్వాలని దరఖాస్తుదారుడినే తిరిగి మున్సిపాలిటీ విభాగం వారు అడగడం గమనార్హం.

‘సమాచార’ం.. ఇవ్వట్లే!

- స.హ. చట్టం ఉన్నా లేనట్టే..
- ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టింపు కరువు
- దరఖాస్తుదారునికి ‘నో’ అనే ధిక్కారం
- కొన్నిచోట్ల తప్పుదోవ పట్టించేలా ఇన్ఫర్మేషన్



కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టం అధికారుల వివరాలు

సాక్షి,ఆదిలాబాద్: ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం ఇలా అపహాస్యంగా మారుతోంది. ఒకవిధంగా ఇది ఉండి లేనట్టుగా తయారైంది. గతంలో ఆర్టీఐ కింద ఎవరైన సమాచారం అడిగితే ఆ కార్యాలయంలో, శాఖలో అవినీతి, అక్రమాలు చేసి ఉంటే అధికారులు భయపడే పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు ఇది నిర్వీర్యం కావడంతో వారిని ప్రశ్నించే వారే లేనట్టుగా వ్యవస్థ కొనసాగుతుందన్న ఆవేదన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

జిల్లా కమిటీ ఏర్పాటే లేదు..

స.హ. చట్టం అమలుకు సంబంధించి ప్రతి జిల్లాలో కమిటీ ఏర్పాటు చేయాలని ఉంది. ఇందులో అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కూడా సభ్యులుగా ఉండాలి. ప్రతి మూడు నెలలకోసారి ఈ చట్టం అమలుకు సంబంధించి రివ్యూ నిర్వహించి లోటుపాట్లను సవరించాలి. అయితే అసలు కమిటీ ఏర్పాటుకు ఇప్పటివరకు అడుగు పడలేదని పౌరులు పేర్కొంటున్నారు. దరఖాస్తుదారునికి 30 రోజుల్లో సమాచారం ఇవ్వాలని నిబంధన ఉంది. ఆ వ్యవధి దాటిన తర్వాత సమాచారం ఇవ్వనందుకు జరిమానా విధించేలా నిబంధనలు ఉన్నాయి. అయితే ఇవన్ని నామమాత్రం మారి, ప్రభుత్వ కార్యాలయాల్లో జవాబుదారితనం లోపించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏది సాధికారత..

రాజ్యాంగం ప్రకారం సమాచార హక్కు ప్రాథమిక హక్కుగా అభివర్ణిస్తారు. దీని లక్ష్యం పౌరులకు సాధికారిత కల్పించడం, ప్రభుత్వ పనిలో పారదర్శకత, జవాబుదారితనం పెంపొందించడం. అవినీతిని అరికట్టడం, ప్రజల కోసం పనిచేసేలా చేయడమే దీని ముఖ్య ఉద్దేశం. అయితే కొన్నేళ్లుగా దీని లక్ష్యం పక్కదారి పట్టింది. అసలు సమాచార హక్కుచట్టం ఉందా.. లేదా అన్నట్టుగా తయారైంది. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద ప్రాథమిక సమాచారం ఇచ్చేందుకు వ్యవస్థ ఉంటుంది. అయితే ప్రస్తుతం ఆ వ్యవస్థ నామమాత్రంగా మారిందనే విమర్శలు బాహటంగానే వ్యక్తమవుతున్నాయి.

అప్పిలేట్ అథారిటీని ఆశ్రయించాలి..



దరఖాస్తుదారుడికి కార్యాలయంలోని సమాచార అధికారి ఇచ్చిన జవాబు సంతృప్తిగా లేనిపక్షంలో అప్పిలేట్ అథారిటీని ఆశ్రయించాలి. మున్సిపాలిటీలో అప్పిలేట్ అథారిటీ ఆఫీసర్ కమిషనర్. ఈ అథారిటీని ఆశ్రయించిన తర్వాత 30 రోజుల్లోగా పరిశీలన చేసి జవాబు ఇవ్వడం జరుగుతుంది.

– ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, ఆదిలాబాద్

‘అమృత్ 2.0’కు బ్రేక్

- ఎన్నికల కోడ్‌తో నిలిచిన పనులు
- ఇప్పటికే పూర్తయిన టెండర్ల ప్రక్రియ
- మూడు నెలల తర్వాత ప్రారంభమయ్యే అవకాశం

కైలాస్‌నగర్:ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో అమృత్ 2.0 కింద మంజూరైన తాగునీటి సరఫరా, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఎన్నికల కోడ్‌తో బ్రేక్ పడింది. ఈ పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు మున్సిపల్ వాటా నిధులతో చేపట్టేందుకు రూ.320.96 కోట్లను కేంద్రం గతేడాది మంజూరు చేసింది. వీటికి సంబంధించి టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. త్వరలో పనులు ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తుండగా లోక్‌సభ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి రావడంతో పనులు ప్రారంభించే అవకాశం లేదు. కోడ్ ముగిశాకే మూడు నెలల తర్వాత తిరిగి ప్రారంభం కానున్నాయి.

అగ్రిమెంట్ దశలో ఆగిన పనులు

పట్టణంలో తాగునీటిసమస్య పరిష్కరించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద ఆదిలాబాద్ మున్సిపాలిటీకి గతేడాది మే 20న రూ.95.50 కోట్ల నిధులు విడుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు బల్దియా కూడా తమ వాటా చెల్లించి కొత్తగా పైపులైన్ల ఏర్పాటు, తాగునీటి ట్యాంక్‌ల నిర్మాణాలు, కుళాయి కనెక్షన్లు వంటి పనులను చేపట్టేలా మార్గదర్శకాలు జారీచేసింది. అప్పుడే ఈపనులను ప్రారంభించాల్సి ఉండగా టెండర్ల దాఖలుకు గుత్తేదారులు ముందుకు రాలేదు. దీంతో పనులు నిలిచిపోయాయి. గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం కొద్ది రోజుల పాటు పక్కన పెట్టింది.గతఫిబ్రవరిలో అనుమతినివ్వడంతో రాష్ట్ర స్థాయిలో మున్సిపల్‌శాఖ ఇటీవ ల మరోసారి టెండర్లకు ఆహ్వానించింది. కాంట్రాక్ట ర్లు ముందుకు రావడంతో ఆ ప్రక్రియ పూర్తయింది. కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ దశలో ఉండగా కోడ్ రాకతో పనులు చేపట్టేందుకు అవకాశం లేకుండా పోయింది.

టెండర్ల ప్రక్రియ పూర్తయినా...

అస్తవ్యస్తంగా ఉన్న ఆదిలాబాద్ పట్టణ మురుగు నీటి వ్యవస్థను చక్కదిద్దడంతో పాటు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ మురుగునీరు పారకుండా ఉండేలా పట్టణానికి అమృత్ 2.0 కింద కేంద్రం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.225.46 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో పనులు చేపట్టేందుకు వీలుగా బల్దియా అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి ప్రభుత్వానికి డీపీఆర్‌ను సమర్పించారు. 24 కిలోమీటర్ల మేర ప్రధాన పైపులైన్‌తో పాటు నాలుగు సేవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ) మురుగు నీటి శుద్ధి కేంద్రాలను నిర్మించేలా ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. పనులు దక్కించుకున్న గుత్తేదారుతో అగ్రిమెంట్ చేసుకుని పనులు ప్రారంభించేలా పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ దశలో ఎన్నికల కోడ్ రావడంతో ఈ పనులకు బ్రేక్ పడినట్లైంది. ఎన్నికల కోడ్ ముగిసే జూన్ 4వ తేదీ వరకు పనులు ప్రారంభించే అవకాశం లేదు. అయితే పనులను జూన్‌లో ప్రారంభించినా వర్షాలు కురిసే అవకాశముండటంతో వాటిని పూర్తి చేయడం మరింత ఆలస్యమయ్యే అవకాశముందనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

కోడ్ ఉల్లంఘనలా.. 1950కి కాల్ చేయండి

- కలెక్టర్ రాజర్షి షా



కాల్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

కైలాస్‌నగర్: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలతో కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసే దిశగా అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందు కోసం కలెక్టర్ కార్యాలయంలో 1950 టోల్ ఫ్రీనంబర్‌తో కూడిన ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఎన్నికలు ముగిసే వరకు 24 గంటల పాటు పనిచేసేలా 15మంది ఉద్యోగులను ఈ కేంద్రంలో ప్రత్యేకంగా నియమించారు. ఒక్కో షిఫ్టులో ముగ్గురు ఆపరేటర్లు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు సేవలందించనున్నారు. జిల్లాలో ఎక్కడైనా కోడ్ ఉల్లంఘించినట్లు గుర్తిస్తే ప్రజలు ఈ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చు. వంద నిమిషాల్లోనే ఫ్లయింగ్ స్క్వాడ్ అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తాయని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు.



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి పంపుతున్న సిబ్బంది

‘పది’ పరీక్షలు షురూ





పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు

పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆయా కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడిగా మారింది. తొలిసారి పబ్లిక్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. రెగ్యులర్ విద్యార్థులు 10,402 మందికి గాను 10,367 మంది హాజరయ్యారు. 35 మంది గైర్హాజరయ్యారు. హాజరు శాతం 99.66గా నమోదైంది. ప్రైవేట్ (గతంలో ఫెయిల్ అయిన) విద్యార్థులు 19 మందికి గాను 8 మంది హాజరయ్యారు. పలు పరీక్ష కేంద్రాలను డీఈవో ప్రణీత, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశారు.

– ఆదిలాబాద్‌టౌన్



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పోషకాహారంపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ రాజర్షి షా
- ‘పోషణ్ పక్వాడా’పై అధికారులతో సమీక్ష



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి తదితరులు

కైలాస్‌నగర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి పోషకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పోషణ్ పక్వాడా నిర్వహణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటల ఏర్పాటుతో పాటు అనుబంధ పౌష్టికాహార ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అంగన్‌వాడీలు పనిచేయాలన్నారు. చిరుధాన్యాల ప్రాధాన్యతపై మార్చి 23 వరకు గ్రామస్థాయిలో ప్రచారం కల్పించాలన్నారు. వచ్చే బుధవారం విలేజ్ హెల్త్ శానిటేషన్, న్యూట్రిషన్ డే సందర్భంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అనుబంధ శాఖలను ఆహ్వానించి వంటకాల ప్రదర్శనతో పాటు రక్తహీనత అధిగమించేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించి ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. అధికారులు, అంగన్‌వాడీలతో ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా సంక్షేమాధికారి సబిత, డీఎంహెచ్‌వో నరేందర్, డీఎస్‌వో కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కైలాస్‌నగర్: పెండింగ్ వేతనాల చెల్లింపుతో పాటు ఈఎస్ఐ పేరిట కోత విధించిన రూ.కోటి 36లక్షలు వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. రెండు నెలల పెండింగ్ వేతనాలు, తొమ్మిది నెలల ఈపీఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటేషన్, వాటర్ సప్లయ్ కార్మికులు, డ్రైవర్లకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. దీంతో వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం పెంచిన వేతనం రూ.1000తో కలిపి వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వారాంతపు, పండుగ సెలవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు స్వామి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు



బెల్లం పానకం పారబోస్తున్న పోలీసులు

లక్ష్మణచాంద: గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని పార్‌పెల్లి తాండలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బానోత్ రాజు ఇంట్లో 4 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు. 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. తనిఖీల్లో ఏఎస్సై గంగాధర్, పీసీలు గణేశ్, భూమన్న, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు మట్కా నిర్వాహకుల అరెస్ట్



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై ఆరుగురు మట్కా నిర్వాహకులను అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. సోమవారం జైనథ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా సమీపంలో మహారాష్ట్ర వైపు వెళ్తున్న కొయ్యల రమణ, మేకల సత్యనారాయణ, లక్ష్మణ్, జమీర్, ప్రకాష్, అవినాష్‌ను తనిఖీ చేయగా వారి వద్ద మహారాష్ట్రలోని బోరి–పాటన్‌లో మట్కా నిర్వహిస్తున్న అశోక్ సామ్రాట్‌కు చెందిన పలు మట్కా చీటీలు, రూ.6,030 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఒకటి కంటే ఎక్కువ సార్లు కేసులు నమోదయితే వారిపై పీడీయాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీఐ డి.సాయినాథ్, ఎస్సై పురుషోత్తం పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

తలమడుగు: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పెందూరు సునీల్ (30) కొంతకాలంగా ఏపని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఏదైనా పనిచూసుకొమ్మని తండ్రి భూమన్న మందలించాడు. దీంతో మనస్తాపం చెంది ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న ప్యాసింజర్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
BUSINESS OFFER

■ మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9550606222. [H-787738]

WANTED

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీతం: 18k. ఫోన్: 9160900024 / 9640400073. [H-799854]


■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233893]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

- ప్రేమ పెళ్లి వరకు వెళ్లడం లేదని మనస్తాపం..
- పెద్దలను ఒప్పించే ధైర్యం లేక తనువు చాలిస్తున్న వైనం..
- మూడు పదుల వయసులోపే ముగుస్తున్న జీవితాలు
- కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్న బలవన్మరణాలు



ప్రేమిస్తే.. చావేనా?

నెన్నెల(బెల్లంపల్లి): ప్రేమ.. నేటి యువతకు పరిచయం అక్కర్లేని పదం. తెలిసీ తెలియని వయస్సులో ఆకర్షణో.. ప్రేమో అర్థం చేసుకోలేక ఆలోచించే పరిపక్వత లేక జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటూ కన్నవారికి కడుపు కోత మిగులుస్తున్నారు. ప్రేమ విషయం పెద్దలకు చెప్పుకోలేక , ప్రేమను ప్రియుడు, ప్రియురాలు నిరాకరించడంతో అఘాయిత్యాలకు ఒడిగడుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం కేటాయించి వారిలో స్నేహభావం పెంపొందిస్తేనే ఇలాంటి సమస్యలకు పరిష్కార మార్గం దొరుకుతుందని మానసిక వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సినిమాల ప్రభావంతో..

సినిమాల ప్రభావం నేటి యువతరం మీద ఎంతగానో పడుతోంది. ప్రేమ అనే అంశం లేకుండా సినిమాలు ఉండటం లేదు. వీటిని చూసిన యువత ప్రేమకు ఆకర్షితులవుతున్నారు. దీనికి తోడు సెల్‌ఫోన్‌లు ప్రేమికులను మరింత చేరువ చేస్తున్నాయి. చాటింగ్,వాట్సాఫ్‌కాల్,వీడియోకాల్‌తో ప్రేమికులు నిత్యం కలుసుకునేందుకు వీలుగాఉంటోంది. సోషల్ మీడియా ప్రభావం కూడా యువతపై పడుతోంది.

మచ్చుకు కొన్ని ఘటనలు

- బెల్లంపల్లి పట్టణం షంషీర్‌నగర్‌కు చెందిన సోయం తేజశ్రీ నెన్నెల మండలం లంబాడితండాకు చెందిన దరావత్ రాజ్‌కుమార్ కొంతకాలంగా ప్రేమించుకున్నారు. ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో ఏంచేయాలో తోచక తేజశ్రీ అక్టోబర్ 6, 2022న పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది.
- కుశ్నపల్లికి చెందిన జాడి రవి, వేమనపల్లి మండలం బుయ్యారం గ్రామానికి చెందిన సత్యశ్రీ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. సత్యశ్రీ అనారోగ్యానికి గురికావడంతో మృతి చెందింది. ప్రియురాలి లేని జీవితం వ్యర్థమని భావించిన రవి 2022 ఫిబ్రవరి 9న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- 2023 ఫిబ్రవరి 19న హాజీపూర్ మండలం దొనబండలో ఆర్థిక ఇబ్బందులతో శ్రీకాంత్ అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ప్రియురాలు సంఘవి ప్రియుడు లేని లోకంలో నేనుండలేనని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.
- బెల్లంపల్లి పట్టణానికి చెందిన సాజిద్, యశ్వంతిక కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వారి ప్రేమను పెద్దలు అంగీకరించకపోవడంతో 2021 అక్టోబర్ 23న జైపూర్ శివారులోని గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు.
- భీమిని మండలం మల్లీడి గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని దొబ్బల కల్పన, అదే గ్రామానికి చెందిన కోట మల్లేశ్ ప్రేమించుకున్నారు. మల్లేశ్ పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెందిన కల్పన 2021 డిసెంబర్ 26న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.
- మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామానికి చెందిన నాంపల్లి సంగీత, నెన్నెల మండలం చిత్తాపూర్‌కు చెందిన తీగుళ్ల భగవాన్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. భగవాన్‌తో పెళ్లికి నిరాకరించిన యువతి తల్లిదండ్రులు వేరే పెళ్లి సంబంధాలు చూస్తుండడంతో మనస్తాపం చెందింది. ఈ నెల 13న ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ప్రియురాలి మరణవార్త విన్న ప్రియుడు పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

తల్లిదండ్రులు స్నేహితులుగా మెలగాలి

ప్రతీ మనిషికి స్నేహితుడి తోడు ఎంతో అవసరం. మంచి, చెడులను వివరించి చెప్పగలిగే స్నేహితుడు దొరికినట్లయితే వారు చాలా అదృష్టవంతులు. అమ్మానాన్నలు తమ పిల్లలను స్నేహితులుగా భావించాలి. వారికి కలిగే చిన్న చిన్న సమస్యలను మొదలుకొని ప్రేమ వ్యవహారాల్లో సైతం స్నేహితుడి పాత్ర పోషించాలి. పెద్దలకు తెలియకుండానే ఏమనుకుంటారనో, ఏమైనా చేస్తారోననే భయంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

తల్లిదండ్రులు, టీచర్లు గమనిస్తూ ఉండాలి



పిల్లల ప్రవర్తనను ఇంట్లో తల్లిదండ్రులు, బడిలో టీచర్లు గమనిస్తూ ఉండాలి. పిల్లలు తప్పు చేస్తే కొట్టడం, తిట్టడం చేయకుండా ఓపికతో మాట్లాడి నచ్చజెప్పాలి. చెడు మార్గం వైపు వెళ్లకుండా చూడాలి. ప్రేమికులు మొదట తల్లిదండ్రుల మనస్సు గెలుచుకోవాలి. ప్రేమించడంతో పాటు యోగ్యతను సంపాదించాలి. ఆర్థిక స్థిరత్వం ఉంటే తల్లిదండ్రులు ఒప్పుకునే వీలుంటుంది. అనుకున్నది జరగకపోతే తట్టుకునే శక్తి లేక యువత క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. యువతకు భవిష్యత్‌లో లక్ష్యం లేకపోవడం కూడా ఒక కారణం.

– డాక్టర్ సునీల్‌కుమార్, మానసిక వైద్య నిపుణులు, మంచిర్యాల

చట్టాలను ఉపయోగించుకోవాలి



యువత చట్టాన్ని ఉపయోగించుకుని చట్టపరమైన హక్కులు సాధించుకోవాలి. పిరికితనంతో ఆత్మహత్యలకు పాల్పడవద్దు. ప్రస్తుత కాలంలో పిల్లలు ఆటలకు దూరం కావడం కూడా ఒక కారణం. ఆటలు ఆడటం ద్వారా గెలుపు, ఓటములను తట్టుకునే శక్తి ఉంటుంది. ముఖ్యంగా యువత సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలి. సమస్యలు ఎదురైతే ఎలా పరిష్కరించుకోవాలో తెలుసుకోవాలి. బ్రతకడానికి ఎన్నో మార్గాలు, చావడానికి ఒకటే మార్గం. ధైర్యంగా ముందుకు నడవాలి.

– శ్యాంపటేల్, ఎస్సై, నీల్వాయి

పార్టీని పటిష్టం చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు నాయకులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని కేఎస్‌ఆర్ క్యాంపు కార్యాలయంలో నిర్మల్ నియోజకవర్గంలోని మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను గ్రామాల్లో ఇంటింటికీ వివరించాలని సూచించారు. గ్రామ, మండల, పట్టణంలోని వార్డు కమిటీలను త్వరలో పూర్తి చేయాలన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉండాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

క్రమశిక్షణతో ఆడి విజయం సాధించాలి



పరిచయం చేసుకుంటున్న గోవర్ధన్‌రెడ్డి

ఉట్నూర్‌రూరల్: జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటున్న క్రీడాకారులు క్రమశిక్షణతో ఆడి విజయం సాధించాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. ఢిల్లీలో ఈ నెల 28న జరుగనున్న ఖోఖో పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉట్నూర్‌లోని కొమురంభీం కాంప్లెక్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, ఏఎస్‌వో హేమంత్, కోచ్ శివకృష్ణ, ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో ఖుష్బూగుప్తా

తాంసి: గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులతో పాటు సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. వసతిగృహం పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, విద్యార్థులకు కనీస వసతులు లేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మరుగుదొడ్లు సరిపోవడం లేదని, ఫ్యాన్లు,ఆర్వో ప్లాంట్ సైతం లేదని విద్యార్థులు పీవో దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సిబ్బంది హాజరు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. కుక్ మహేందర్, వాచ్‌మెన్ విజయ్ స్థానంలో ఇతర వ్యక్తులు పనుల్లో ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరైన వార్డెన్ స్వప్నను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. విజయ్, మహేందర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పీవో వెంట ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయులు గంగయ్య, ప్రభాకర్ ఉన్నారు.

'గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు చేయాలి'



లోగో ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని తెలంగాణ స్టూడెంట్ ఫోరం (టీఎస్‌ఎఫ్) తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో సోమవారం టీఎస్‌ఎఫ్ లోగో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విశ్వ విద్యాలయంతో ఆదివాసీ, గిరిజనులకు మేలు చేకూరుతుందన్నారు. కామన్ స్కూల్ విద్యావిధానం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ నారాయణ, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్ నాయక్, ఏఐఎస్‌బీ రాష్ట్ర అధ్యక్షుడు జీవారే రాహుల్, జిల్లా అధ్యక్షుడు దాదేరావు, కార్యదర్శి అశోక్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గణేశ్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లేతజొన్న తిని 34 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

లోకేశ్వరం: లేత జొన్నకర్రలు తిని 34 గొర్రెలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రసూల్ యాదవ్, పిప్రి పోతన్న యాదవ్‌కు చెందిన గొర్రెలను ఆదివారం మేతకు తోలుకెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఓ రైతు చేనులో లేత జొన్నకర్రలను మేపారు. రాత్రి గొర్రెల కడుపులు ఉబ్బడంతో వెంటనే పశువైద్యులకు సమాచారం అందించారు. చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. రసూల్‌కు చెందిన 19, పోతన్నకు చెందిన 15 గొర్రెలు మృతి చెందాయి. వాటి విలువ రూ.4లక్షల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. బాధిత కుటుంబాలను సోమవారం ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పరామర్శించారు. నష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఆయన వెంట నాయకులు జయసాగర్‌రావు, మెండె శ్రీధర్, చిన్నారావు, రాజశేఖర్, సుమన్ కుమార్, సరస్వతి ఉన్నారు.

కుక్కల దాడిలో ఏడు గొర్రెలు మృతి

ముథోల్: కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని దనగరిగల్లీలో రైతు కోనేకర్ లక్ష్మణ్ ఆదివారం తమ గొర్రెలను మేతకోసం అడవికి తోలుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి పశువుల పాకలో గొర్రెలను తోలి ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి సమయంలో పశువుల పాకలోకి కుక్కలు చొరబడి గొర్రెలపై దాడి చేశాయి. సోమవారం ఉదయం లక్ష్మణ్ వెళ్లే సరికి ఏడు గొర్రెలు మృతి చెంది ఉన్నాయి. మృతి చెందిన గొర్రెల విలువ రూ.70వేల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. నష్టపరిహారం అందించాలని అధికారులను వేడుకున్నాడు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

తానూరు: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. దౌలతాబాద్‌కు చెందిన రాజుల వెంకన్న (50)తన కున్న మూడెకరాల్లో ఏటా పంటలు సాగు చేయగా రెండేళ్లుగా భారీ వర్షాలు, వరదల కారణంగా దిగుబడి రాలేదు. ఏడాది క్రితం కొంతమేర అప్పులు చేసి కుమార్తె వివాహం చేశాడు. సాగు పెట్టుబడితో పాటు కుమార్తె వివాహానికి చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక మనోవేదన చెందాడు. సోమవారం పంటచేనులో చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుని భార్య భోజాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

- 360 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు



ఎడ్లబండిపై విరిగిపడిన చెట్టు



బరంపూర్ శివారులో నెలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎంపీటీసీ, గ్రామ పెద్దలు

తలమడుగు: మండలంలోని బరంపూర్, నందిగామ, పల్లి(బి), పల్లి(కే) గ్రామాల్లో సోమవారం సాయంత్రం కురిసిన వడగళ్ల వర్షానికి మొక్కజొన్న, వేరుశనగ, పొగాకు పంటలు నేలకొరిగాయి. బరంపూర్‌లో రైతు జక్కుల విట్టల్‌కు చెందిన ఎడ్లబండిపై చెట్టు విరిగిపడింది. మండలంలోని దాదాపు 200 ఎకరాల్లో మొక్కజొన్న, 80 ఎకరాల్లో జొన్న పంట, 50 ఎకరాల్లో వేరుశనగ పంట, 30 ఎకరాలలో పొగాకు పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. ఎంపీటీసీ రంజిత్, గ్రామ పెద్దలు కేదారేశ్వర్ రెడ్డి, మల్లేశ్ పంటలను పరిశీలించి వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు సర్వే నిర్వహించి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ప్రకృతితోనే మానవ మనుగడ



మస్కాపూర్‌లో మాట్లాడుతున్న వెంకటేశ్

ఖానాపూర్: భారతీయ జీవనవిధానం ప్రకృతితో ముడిపడి ఉందని, మానవ మనుగడకు ప్రకృతే ఆధారమని సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేశ్ అన్నారు. మండలంలోని మస్కాపూర్ కేజీబీవీ విద్యార్థులకు ప్రకృతితో స్నేహం–పక్షులకు సహాయం కార్యక్రమంపై సోమవారం అవగాహన కల్పించారు. మానవులు చేసే కొన్ని తప్పిదాలతో ప్రకృతి అంతరించిపోతోందన్నారు. దీని ప్రభావం మానవ మనుగడపై చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం, శబ్ద కాలుష్యం, రేడియేషన్‌తో పక్షులు అంతరించిపోతున్నాయని తెలిపారు. వేసవిలో పక్షులకు, మూగజీవాలకు నీటి తొట్టిలు, బర్డ్ ఫీడర్లు, పక్షిగూళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఇంటికో ఎడ్లబండి.. నీళ్లకేనండి!





వేసవి ఆరంభంలోనే జిల్లాలో నీటి సమస్య మొదలైంది. ఏజెన్సీ ప్రాంతాల్లో తీవ్రంగా ఉంది. మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో గిరిజనులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం సాలెగూడ వాసుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. గ్రామంలో ప్రతీ ఇంటి ముందు డ్రమ్ములతో కూడిన ఎడ్లబండే దర్శనమిస్తోంది. నీళ్లు కావాలంటే బండి కట్టాల్సిందేనని, రోజూ సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని పంట చేల వద్దకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి కోసం పనులు సైతం వదులుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

అంజీలో సామూహిక నిశ్చితార్థ వేడుకలు



ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని అంజీ గ్రామంలో సోమవారం సామూహిక నిశ్చితార్థ వేడుకలు నిర్వహించారు. అంద్ ఆదివాసీ సంప్రదాయం ప్రకారం సంత్ సద్గురు పూలాజీబాబా ధ్యాన మందిరంలో ఆరు జంటలకు నిశ్చితార్థం నిర్వహించినట్లు వంశ పెద్దలు తెలిపారు. ఈ నెల 26న మండలంలోని దస్నాపూర్‌గూడలో వీరికి సామూహిక వివాహాలు నిశ్చయించినట్లు పేర్కొన్నారు. సద్గురు పూలాజీబాబా ఆశయసాధనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో అంద్ ఆదివాసీ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాకురే రాందాస్, సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖడే విష్ణు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉత్తం, కులపెద్దలు మారుతి, పుండలిక్, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.